# లేచి వచ్చిన ఆడది



## పల్లవి

...బండి వూరి మధ్యకు వచ్చేసింది. ఇంకా తెల్లవారలేదు. చీకటి చీకటిగా వున్న ఆ వూళ్లోకి ప్రవేశించింది గుర్రం బండి.

బండిలో కూర్చున్న విశాలిమారిపోయిన వూరి పరిసరాలను విచిత్రంగా గమనిస్తోంది.

"ఎటు వెళ్ళాలమ్మగారూ?"

బండి వాడు వెనక్కితిరిగి ప్రశ్నించాడు.

అతన్తో ఏదో చెప్పింది. వినబడీ, వినబడ నట్టు ఏదో గొణుగుతున్న ఆమెవంక విచిత్రంగా చూసి బండీ పోనివ్వ సాగాడు.

సరిగ్గా అయిదుసంవత్సరాలయివుంటుంది. తిరిగి మళ్ళీ ఈనాడు ఈ వూళ్ళో కాలెట్టింది.

అయిదు సంవత్సరాలనాడు ఈ వూరు వచ్చింది అప్పటి పరిస్థితులు వేరు. అప్పుడు తన పక్కన బండీలో తన తండ్రి కూడా వున్నాడు. ఆ నాడు తన తండ్రి రక్షణా, లోకం సానుభూతి వున్నాయి.

కానీ యీనాడు తండ్రి లేడు. లోకం దృష్టిలో తను చెడిపోయిన స్త్రీ. గంట గణ గణలాడిస్తూ బండీ వాడు ఎవర్నో ఏదో ప్రశ్నిస్తున్నాడు.

* * *

విశాలి ఎక్కువగా చదువుకోలేదు. కానీ ఆమె ఆలోచనలు విచిత్రంగా సాగేవి. ఆమె ప్రవర్తనే విచిత్రంగా వుండేది.

చదువుతూ, చదువుతూ మధ్యలో మానేస్తానంటె కారణం ఏమిటన్నాడు తండ్రి.

"నాకు సంగీతం నేర్చుకోవాలనుంది నాన్నా" అంది నిదానంగా. "బాగుంది. ఇక్కడికి చదువు అయింది. ఇహ సంగీతం..." అన్న—సుందరం వెటకారంగా అన్నాడు.

అతనికి మొదట్నించీ చెల్లెలు పట్ల సదభిప్రాయంలేదు. కారణం అతనికీ తెలీదు. ఒక్కొక్కర్ని చూస్తే మొదటి చూపులోనే ఇష్టంలాంటిది కలుగుతుంది. మరి కొందరు దురదృష్టవంతులుంటారు విశాలిలాంటివాళ్ళు.

వాళ్ళ మొహంలో ఏదివ్య శక్తి కనిపిస్తుందో గానీ చూడగానే ఏహ్యభావం కలుగుతుంది. ఆకోవకి చెందుతుంది విశాలి. ఆమెను ఇష్టపడేవాళ్ళు బహుకొద్ది మంది. వారిలో ఆమె తండ్రి గుర్నాధం ఒకడు.

పుట్టగానే తల్లిని కోల్పోయిన విశాలి అతనికిఆరో ప్రాణం. ఆమె చిన్నప్పట్నుంచీ కోరింది, అది ఏదైనా సరే సంపాదించి ఇవ్వాలని తాపత్రయపడేవాడు.

విశాలి విషయంలో ఆయన కొడుకుని కూడా లక్ష్య పెట్టేవాడుకాదు.

చిన్నప్పుడు తనతో సమానంగా పరికిణీ గోచీ పోసికట్టి గోళీ లాటకి, పరుగు పందాలకి పరిగెత్తుకొచ్చే విశాలిని చూసి చిరచిరలాడే వాడు సుందరం. ఆపిల్లనేమీ అనటానికి వీల్లేదు. ఎందుకంటే తండ్రి కఠినమైన చూపులు ఒక వంక జ్ఞాపకం వస్తూనే వుండేవి. తన తోటి మగ పిల్లలతో ఆమె అలా ఆడటం అతనికి యిష్టం వుండదు. క్రమంగా వాసూ, గోపీ వాళ్ళు తన వురికినే మర్చిపోయి విశాలి వేపు ఆసక్తిగా చూస్తూ, "మనం దొంగాట ఆడుకుందామా, కళ్ళకి గంతలు కట్టుకోవాలి" అని ఆమె కళ్ళకి గుడ్డలు కట్టి పరుగెత్తేవాళ్ళు. ఒకసారి ఆమె యధాలాపంగా వుండటం చూసి చటుక్కున ఆమె చెయ్యిపట్టుకుని బుగ్గ మీద ముద్దెట్టుకున్నాడు సుధాకర్. అప్పటికి ఆమె వయసు పదిహేను, పదహారు సంవత్సరాలుండవచ్చు. ఈ దృశ్యం కళ్ళారా చూసిన సుందరం కారాలు, మిరియాలు నూరుతూ ఇంటికి వచ్చాడు, అప్పటికప్పుడే సుధాకర్ చెంప ఫెడేల్ మనిపించి, కళ్ళు బైర్లు కమ్మి దిమ్మెరపోయి నిలబడిన సుధాకర్ కేసి చూడకుండా—

అన్న వెనకాలే నిదానంగా నడిచి వచ్చింది విశాలి.

ఇంటికి రాగానే చెల్లెలి మీద ఇంతెత్తున ఎగిరాడు.

విశాలి తండ్రి రాగానే అంతా చెప్పి, "నా తప్పేమిటో చెప్పునాన్నా" అన్నది చివరికి.

కూతురి తప్పేమీ లేదనే అనిపించింది ఆయనకు కూడా.

విశాలితో అయిదవ తరగతి వరకూ చదివి మానేసిన పంతులుగారి జయలక్ష్మి తనకు పెళ్ళిచూపులని సంబరంగా చెపుతుంటే, తండ్రి చొక్కాకి గుండీలు కుడుతున్న విశాలి, "నీకిది రెండవసారి, అతనికెన్నో సారి?" అన్నది. జయలక్ష్మి తెల్ల మొహం వేసింది.

"సంతలో పశువుల్ని ఏరుకున్నట్టే! ఇవాళ నువ్వు నచ్చక పోతే రేపు ఇంకొకత్తి... నేనూ అంతేననుకో..."

జయలక్ష్మి మళ్ళీ మాట్లాడకుండా వెనక్కి తిరిగి వెళ్ళి పోయింది.

...విశాలిని చూట్టానికి వచ్చారు.

సంత; పశువులు అని హేళన చేసిన విశాలి పెళ్ళి చూపులకు కూర్చోకతప్పలేదు

వాళ్ళు వెళ్ళి పోయాక తండ్రి దగ్గరగా వచ్చి, "ఏమ్మా! వాళ్ళకి నీవు నచ్చావుట, నీవుద్దేశం ఏమిటి?"

"నిజంగా చెప్పాలంటే నాకసలు పెళ్ళే యిష్టం లేదు నాన్నా.

జీవితానికి పెళ్ళి తప్పదు గాబట్టి నా కెవరైనా ఒకటే!"

తండ్రి నిర్ఘాంత పోయాడామె మాటలకి.

ఆడపిల్లలందరూ పెళ్ళిచేసుకుంటున్నారు. కాబట్టి తనూ చేసుకుంటుంది అంతే!

ఆమె మనస్తత్వాన్ని ఏవిధంగా అర్థం చేసుకోవాలో తెలీక తికమక పడ్డాడాయన.

విశాలి పెళ్ళి జరిగి పోయింది.

విశాలి అత్తవారింటికి ప్రయాణమై వెడుతుంటే —రాలుగాయిపిల్ల,రౌడీ బుద్ధులూ అని ఎప్పుడూ దుమ్మెత్తి పోసే ఎదురింటి బామ్మగారు విశాలి తలనిమురుతూ, రాని కన్నీళ్ళని కొంగుతో వత్తుకుంటూ, "నోట్లో నాలికలేదమ్మా బిడ్డకి. కొత్త చోటు,పరాయి మనుషులు ఎలా నడుచుకుంటావో... వంశానికి పేరుతేవాలి" ఇంకా ఏదో చెప్పబోయింది.

విశాలి ఆవిడ వేపు చూసింది.

"మీరేం తప్పు చేశారనీ, తాతగారు మిమ్మల్ని వదిలి పెట్టి సన్యాసుల్లో కలిశారని చెప్పుకుంటారే..."

విశాలి భర్త శ్యామలరావు ఆశ్చర్యంగా చూశాడు ఆమెవంక. అమ్మలక్కలు బుగ్గలు నొక్కుకున్నారు.

విశాలి అత్తవారింటికి వెళ్ళి పోయింది.

కానీ...

ఆమె తిరిగి పుట్టింటికి చేరుకోవటానికి ఎక్కువ కాలం పట్టలేదు.

గుర్నాధంగారు అర్జెంట్ టెలిగ్రాం అందుకున్నాడు.

"విశాలి భర్త పోయాడు, హార్ట్ ఎటాక్ వచ్చి" అదీ అందులోని సారాంశం. గుర్నాధంగారు నెత్తీ నోరూ బాదుకుంటూ వెళ్ళారు. కూతురు ఏ పరిస్థితిలో వుందో, ఆమెని ఎలా ఓదార్చాలి,అని ఆయన దుగ్ధ. కూతుర్ని ఎటువంటి స్థితిలో చూడాల్సి వస్తుందోనని భయపడ్తు లోపలకు అడుగు పెట్టిన గుర్నాధంగారు ఈ దృశ్యం చూశారు

శ్యామలరావు శవం మీద పడి అతని తల్లి గుండెలు బాదుకుంటూ ఏడుస్తోంది. ఆమె పక్కనే ఇరుగు పొరుగు వచ్చి కూర్చున్నారు.

గుర్నాధంగారి కళ్ళు వెతికాయి.

విశాలి దూరంగా మోకాళ్ళల్లో తల దూర్చుకుని నిర్వికారంగా చూస్తోంది.

ఆమె కంట్లో తడిలేదు.

గుర్నాధంగారు విసుగ్గా చూశారు కూతురి వంక.

పదిరోజులూ అయిందాకావుండి జరగవలసిన కార్యక్రమాలన్నీ ముగించి విశాలిని తనతో తీసుకువెళ్ళాలని ఆయన ఆలోచన. పదోనాడు అత్తా, మామగానీ, తండ్రిగానీ ఎవరూ విశాలిలో వైధవ్యపు చిహ్నాలు తీసుకురాలేక పోయారు.

విశాలి ఈ విషయంలో గట్టిగానే పోట్లాడింది.

విశాలి అత్త ఆగలేక, కొన్నిరోజులుగా ఆవిడలో అణిచిపెట్టబడిన తిరస్కారం బయటకు పొంగుతుంటే విశాలి రెక్కపుచ్చుకుని వీధివేపుగుంజి. "పోవేముదనష్టపు దానా, నా కొడుకుమీద ఇష్టం వున్నదానివైతే ఇట్లామాట్లాడతావు?...వాడు పోయాడని నీకు బాధ లేదు." అని శాపనార్థాలతో బయటకు గెంటింది. విశాలి మారుమాట లేకుండా కట్టుబట్టల్తో తండ్రి వెంటవచ్చేసింది. బాధని వ్యక్తపరుచుకోవటం చాలా తేలికయిన పనల్లేవుంది. సరిగా

ఆమెకీవయసులో రాకూడనికష్టం వచ్చింది.నెల్లాళ్ళ కలిసివుండని మనిషిమీద ఇష్టమా?

ఇరుగు పొరుగువాళ్ళుపోతే కలిగే సానుభూతే ఇప్పుడూ కలిగింది. అంతకన్నా ఆయనకీ, తనకీ ఏం సంబంధం? ఈమాటలు విశాలిపైకి చెప్పలేదు.

విశాలి దుఃఖంతో కృంగిపోతుందనీ, ఆమె కోలుకోవటానికి చాలా కాలం పట్ట వచ్చుననీ వూహించిన గుర్నాథంగారి వూహ తప్పయింది.

ఎందుకంటె విశాలి పూర్వం ఎలావుందో ఇప్పుడూ అట్లానేవుంది. ఆమెను పరామర్శించటానికి వచ్చినవారు కులాసాగా నవ్వుతూ, ఇంట్లో తిరుగుతున్న ఆమెని ఎట్లా ఓదార్చాలో అర్థంగాక వచ్చిన దారినే వెళ్ళిపోయారు.

"బొట్టు, గాజులు మానేయి మనసాంప్రదాయానికి విరుద్ధం," అని ఏదో చెప్పబోతున్న అన్నవంక నిరసనగా చూసింది. ఆమె ప్రవర్తనకు వుగ్రుడై తిలకించటం మినహా మరేమీ చెయ్యలేకపోయాడు.

సుందరం స్నేహితుడు కేశవరావు.

ఆతను తరచూ వీళ్ళింటికి వస్తూంటాడు.

తరచూవచ్చేవాడల్లా ఇంకా ఎక్కువగారాసాగాడు ఈమధ్య. అందుకొక్కారణం తేలిగ్గానే వూహించుకోగలిగింది విశాలి. అదేమంత పెద్దకష్టంకాదు. ఆ విద్య స్త్రీలకి పుట్టుకతోనే వస్తుందేమో! అతను తనపట్ల ఆకర్షితుడవుతున్నాడని తెలుసుకోవటానికి ఎక్కువ కాలం పట్టలేదు ఆమెకి.

కానీ అతనిలో వెతికచూద్దామన్నా తేలిక భావాలు కనపట్టంలేదు. తనపట్ల ఎంతో మర్యాదలతో ప్రవర్తిస్తున్నాడు మానసికంగా ఒంటరిదైపోయిన విశాలి త్వరలోనే అతనికి దగ్గిర కాగలిగింది. అతని మాటలు ఎంతో ఆదర్శప్రాయంగా వుంటాయి.

"మీకు జరిగిన నష్టం తెలుసుకున్నాను. ఈకాలపు ఆడవాళ్ళు నాగరికత పేరిట ఎన్నివెర్రివేషాలు వేసినాసనాతనాచారాలని మాత్రం వదులుకోలేకపోతున్నారు."

తననుంచి ఆమెఎటువంటి సానుభూతీ కోరటంలేదని తెలుసు అతనికి.

"ఆడవాళ్ళలో ఈ ధైర్యంనాకు చాలా యిష్టం. ఎంతసేపూ ముసలమ్మ కబుర్లు చెపుతారేతప్ప ఒక్కడుగు ముందుకు వెయ్యలేరు... మీరునాకు నచ్చారు..." అన్నాడు కేశవరావు.

అతని మాటలు ఆమెలో ఆలోచనలు రేకెత్తించినాయి. సలహా చెప్పటానికి ఇప్పుడు తండ్రిలేడు. తనమీద దిగులుతోనే ఆయనప్రాణం విడిచాడు. తనజీవితం తనే చక్కదిద్దుకోవాలి.

విశాలి అభిప్రాయంవిని సుందరం ఛీత్కారం చేశాడు. నిర్దాక్షిణ్యంగా తూలనాడాడు. అనరానిమాటలన్నాడు.

విశాలి ఆలోచిస్తుండగానే కేశవరావుకి అక్కణ్ణుంచి ట్రాన్స్‌ఫర్ అయింది. వెళ్ళబోతూ విశాలికి తనకోరిక మరొక్కసారి తెలియచేసి మరీవెళ్ళాడు.

విశాలికి అన్నదగ్గర తనస్థానం ఏమిటో బాగా తెలిసింది. తనను యిష్టపడిన కేశవరావు గుర్తుకొస్తున్నాడు. అన్న నిరాదరణకన్న కేశవరావుతోటి జీవితమే మంచిదిగా తోచింది. అతన్ని సంతోషపెట్టి తను సుఖపడాలనే నిర్ణయానికొచ్చింది. కేశవ్‌ని రిజిష్టర్ మ్యారేజ్ చేసుకుంటానని చెప్పినప్పుడు.

"మన పరువు మర్యాద......సంఘం" అంటూ పాఠం చదివాడు సుందరం.

"ఈ సంఘం నాకేం చేసింది? నాకు

నచ్చని పెళ్ళి చేసుకుని సంఘంతో రాజీ పడ్డాను. నెల్లాళ్ళు తిరక్కుండానే నా భర్త పోతే అందులో నా అపరాధం ఏమిటి? కొడుకు పోగానే కోడల్ని ఇంటి నుండి గెంటివేసిన మా అత్తకన్నా తప్పు చేశానా నేను? ఎన్నాళ్ళు నీమీద ఆధారపడి బ్రతకను? రేపు నీపెళ్ళాం వస్తే ఇదే గౌరవం నామీద వుంటుందా? ఇంతచిన్నవయసులోనే వైరాగ్యం పెంచుకుని జీవితం మీద ఇచ్ఛ ఎందుకు చంపుకోవాలి? నాకు మాత్రం కోరికలు లేవూ? నువ్వూ, నీపెళ్ళాం కులాసాగా గడుపుతుంటే నేను నీయింట్లో వంట మనిషిగా, నీపిల్లలకి ఆయాగా బ్రతకనా?......" అని.

"నేను కేశవరావు దగ్గరకు వెడుతున్నాను" అనేసి వెళ్ళిపోయింది. మనిషి తన క్కావల సిందేమిటో తనకే తెలుసుననే గుడ్డి నమ్మకంతో విర్రవీగుతుంటాడు గానీ అది వట్టిఅబద్ధం. ఈనాడుఅత్యంత ప్రియంగా తోచింది, పరిస్థితుల్ని బట్టి అది అప్రియమై పోవచ్చును.

కేశవరావు విశాలిలో గొప్ప గుణం చూశాడుఒకప్పుడు. సుందరం చెల్లెలిగా, ఒక స్త్రీగా ఆమెలో తనకు వచ్చిన గుణాలు వుంటే వుండ వచ్చును. కానీ అవేగుణాలు భార్యగా ఆమెలో భరించ లేక పోయాడు. ఆమె తెలివి తేటలు, భర్తనే సవాల్ చేసే ఆమె ధైర్యసాహసాలు అతను ఎక్కువ కాలం సహించ లేకపోయాడు.

పరాయిస్త్రీగా ఆమెను గౌరవించ గలిగాడు గానీ తనదీ అనుకోగానే ఒక్కొక్కటిగా లోపాలు గుర్తించి నట్టు కొత్తగా చూడ సాగాడు.

విశాలికి అది కనిపెట్టటానికి ఎక్కువ కాలం పట్టలేదు.

ఆమెకు మొదటిసారి జీవితం మీద విరక్తి కలిగింది.

ప్రకృతి ధర్మంగానూ, లోకభయంతోనూ ఒక గుంజకి కట్టబడ్డ బర్రెల్లాగ జీవన యాత్ర సాగిస్తారు తప్పితే, మనస్ఫూర్తిగా ఒకళ్ళనొకళ్ళకి అర్పించుకుని ఒకరు లేనిదే మరొకరు బ్రతక లేమనుకునే స్త్రీ పురుషులు ఈ ప్రపంచం మొత్తం మీద ఎక్కడా వుండరని తేల్చుకుంది విశాలి చివరకు.

వారిద్దరి మధ్య రేగిన కలతలకి ఫలితం? కేశవరావు మళ్ళీ పెళ్ళి చేసుకోవటానికి సిద్ధపడ్డాడు. ఇది మరీ అసహ్యంగా తోచింది విశాలికి మొదటి సారి తనుచేసిన పొరపాటు, అతని మనసు తను గ్రహించా ననుకోవటం. అతను మళ్ళీ పెళ్ళి చేసుకుంటాననే కన్నా తనను కొట్టి, తిట్టి హింసించి వుంటే తను సంతోషించేది.

"నిన్ను యింట్లోంచి వెళ్ళమని అనను. నువిక్కడే వుండవచ్చు. కానీ నా భార్య హోదాతో మాత్రం కాదు......"

విశాలి తనవి అనుకున్న సామాను వెంట తీసుకుని బయల్దేరింది.

• • •

ఆమె ఇప్పుడు నా అనే వారెవరూ లేని ఒంటరి.

లోకం దృష్టిలో చెడిపోయిన ఆడది.

మొదటి సారి తనకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుకోవాలని ప్రయత్నించింది.

మగవాడు బలహీనతల్ని ఎదుర్కొంటూనేవుంటారు. తప్పటడుగు వేస్తూనే వుంటారు. అన్నీ తెలిసిన విశాలి పరాజయం పొందింది.

జీవితంలో రెండో సారి ఓడిపోయింది.

ఆమె భవిష్యత్తు ఏమిటి?

ఆమె ఏమైనా కావచ్చును...... మొండి ధైర్యంతో పరిస్థితులతో పోరాడి తన జీవితాన్ని చక్కదిద్దుకోవచ్చును, లేదా లోకంలో జరిగే కుళ్ళునీ అన్యాయాన్నీ ఎదుర్కోలేక కళంకినిగా తన బ్రతుకు వెళ్ళమార్చుకోవచ్చును...... నిర్భాగ్యులైన స్త్రీలైతే ఈ ప్రపంచానికే దూరమై జీవితాన్ని అంతం చేసుకోవచ్చును. మన దౌర్భాగ్యపు దేశంలో స్త్రీలకిఇంతకన్న పెద్దమర్యాద జరగబోదు. •